డిగ్రీలో భాష బోధన పూర్తి స్థాయిలో కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న కోదండరాం, హరగోపాల్, నందిని సిధారెడ్డి తదితరులు

పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో భాష బోధన పూర్తి స్థాయిలో కొనసాగించాలని, భాష క్రెడిట్ల సంఖ్యను తగ్గించాలన్న ఉన్నత విద్యా మండలి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. మాతృభాషపై ఎందుకు అంత చులకన అని వారు ప్రశ్నించారు. డిగ్రీ భాష బోధన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, కవి, రచయిత నందిని సిధారెడ్డి, తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా మూల్యాంకనం అవసరమని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా విద్యా విధానాన్ని మార్చడం సరి అయిన పద్ధతి కాదని నందిని సిధారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రామాచారి, ప్రొఫెసర్ మాయాదేవి, డాక్టర్ నీరజ, ఆది రమేష్, కృష్ణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'గాజాలో మానవ హక్కుల ఉల్లంఘన'

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి): గాజాలో అమాయకులు, చిన్నారులు, మహిళలను ఇజ్రాయెల్ చంపేస్తూ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందని, దీనికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ మాజీ ఎంపీ అజీజ్‌పాషా, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో పీపుల్స్ సాలిడారిటీ ఫర్ పాలస్తీనా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. యూఎన్‌వోతో పాటు ప్రపంచ దేశాలు స్పందించి పాలస్తీనీయులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి పాలస్తీనీయులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలుసంఘాల నేతలు అబ్బాస్, మాథ్యూస్, ఉమర్ అహ్మద్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

జైలు జీవితం ఖైదీల్లో మార్పు తెచ్చేలా ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీజీ సౌమ్యమిశ్రా

సైదాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): జైలు జీవితం ఖైదీలకు శిక్ష కాకుండా, వారిని మార్చడానికి సహాయపడే మార్గదర్శకంగా ఉండాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా సూచించారు. శనివారం చంచల్‌గూడలోని సీకా కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్ష, ప్రణాళిక, చొరవ ప్రాజెక్టును డీజీ ప్రారంభించారు. శిక్ష అనేది ఖైదీలకు పునరావాసం, సమాజంలో వారి పునః నవీకరణకు మద్దతు ఇవ్వడానికి వ్యక్తిగతీకరించిన వ్యూహమని అన్నారు. జైలు సిబ్బంది, మనస్తత్వవేత్తలు, విద్యావేత్తలు ఖైదీలు సహకార ప్రయత్నాల ద్వారా శిక్ష ప్రణాళిక ఏర్పర్చుకోవడం కోసం డైనమిక్ ఫ్రేమ్ వర్క్ అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ డాక్టర్ ఎం.ఆర్.అహ్మద్, ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు నిబంధనలు అమల్లో ఉంటాయని సీపీ అవినాశ్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 13 వరకు జరుగనున్న పరీక్షల సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద ఎక్కువ మంది గూమిగూడి ఉండడం నిషేధమని, అదేవిధంగా 200 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ సెంటర్‌లు, ఇంటర్నేట్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. ఈ నిబంధనలు 3వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సీపీ పేర్కొన్నారు.

నాలాల కబ్జాపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో నాలాల కబ్జాను అరికట్టడంపై హైడ్రా దృష్టి సారించింది. ఈ మేరకు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. జూన్‌తో పాటు అవసరమైతే జూలైలో కూడా నాలాల సమస్యలపైనే ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ పరిధిలో నాలాల కబ్జాలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. నాలా ఆక్రమణకు గురైనట్టు రుజువు చేసే చిత్రాలు పాతవి, ప్రస్తుతానివి కూడా తీసుకొచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు.

'టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను నిలిపివేయాలి'

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే నిలిపివేయాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్యాల మల్లికార్జున్‌రెడ్డి విద్యాశాఖను డిమాండ్ చేశారు. జీఓ 25ను తక్షణమే సవరించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని సూచించిన అధికారులు వాటి ఫలితాలు చూడకుండానే జూన్ 13 నాడే సర్దుబాటు అయిన టీచర్లు జాయిన్ కావాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడం అనాలోచిత చర్యకు నిదర్శనమన్నారు. బడిబాట పూర్తయిన తర్వాత జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో చేయాల్సిన టీచర్ల సర్దుబాటును జూన్ 13 వరకే చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యను భ్రష్టు పట్టించడమేనన్నారు.

'ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

గన్‌పార్క్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులను జారీ చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం నగరంలోని గన్‌పార్కు వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక, మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం, తొలి దశ ఉద్యమకారుల ఫోరం, తెలంగాణ ఉద్యమకారుల వేదిక, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కోదండరాం హాజరై ఉద్యమకారులకు మద్దతు తెలిపి, వారి డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు రామగిరి ప్రకాశ్, నగేశ్, చంద్రన్న ప్రసాద్, అంజలి, లావణ్య, సుజి, స్వరూపరాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డ, బాలింత మృతి

- బాలానగర్ పీహెచ్‌సీలో ఘటన

హైదర్‌నగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): బాలింత, ఆమెకు పుట్టిన బిడ్డ మృతి చెందిన ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేపీహెచ్‌బీ ఫోర్త్‌ఫేజ్‌కు చెందిన సామ్యూల్, అరుణ (22) దంపతులు. వీరికి ఏడాది క్రితం వివాహమైంది. సామ్యూల్ ఆటో డ్రైవర్. నిండు గర్భిణిగా ఉన్న అరుణకు శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పురిటినొప్పులు తీవ్రం కావడంతో ఆశా కార్యకర్తకు సమాచారం అందించడంతో వారు వెంటనే బాలానగర్ పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు శనివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో అరుణకు డెలివరీ చేయగా.. బాబుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం పుట్టిన బిడ్డ స్పందించడం లేదని, నిలోఫర్ ఆస్పత్రికి తరలించాలని ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బంది కుటుంబసభ్యులకు సూచించారు. వారు బాబును ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా, డెలివరీ అనంతరం ఉదయం 8 గంటల ప్రాంతంలో అరుణ పరిస్థితి కూడా విషమించడంతో ఆమెను బాలానగర్ పీహెచ్‌సీ సిబ్బంది సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యంతోనే అరుణ, ఆమెకు పుట్టిన బిడ్డ చనిపోయారంటూ బంధువులు ఆరోపించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్ సరే..

సర్వీసు రోడ్డు సంగతేంది?



గోల్నాక చర్చి నుంచి ప్రారంభమైన ఫ్లైఓవర్

- గోల్నాకలో ఎడమవైపు రోడ్డు బంద్‌తో నిత్యం నరకం
- హడావుడిగా ప్రారంభం
- వందలాది కోట్లతో నిర్మించి ఫలితమేందని ప్రజల ఆగ్రహం

గోల్నాక, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తిచేసి ఘనంగా ప్రారంభించారు.. కాని సర్వీసు రోడ్డును పునరుద్ధరించడం మరిచారు. ఆ రోడ్డు బంద్ ఉండడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఫ్లైఓవర్‌ను లాంఛనంగా ప్రారంభించి చేతులు దులుపుకున్నారు.. కాని సర్వీసు రోడ్డును పునరుద్ధరించాలన్న సోయి లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్రతరమయ్యాయి. గోల్నాక చర్చి నుంచి ఛేనెంబర్ చౌరస్తా.. శ్రీరమణచౌరస్తామీదుగా అంబర్‌పేట ముక్రమ్ హోటల్ వరకు రెండు కి.మీ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. 2018 మే లో ఫ్లైఓవర్ పనులకు అప్పటి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేయగా నిర్మాణం పూర్తికావడానికి ఏడేళ్లు పట్టింది. ఎట్టకేలకు మే5న కేంద్రమంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డి రాష్ట్ర మంత్రులతో కలిసి ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. కానీ సర్వీసు రోడ్ల పనులను పూర్తిచేయకుండా ఫ్లైఓవర్‌ను ప్రారంభించి ఇప్పటివరకు సర్వీసు రోడ్డు విషయాన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోల్నాక చర్చి నుంచి ప్రారంభమైన ఫ్లైఓవర్‌కు రెండువైపులా సర్వీసు రోడ్లను పునరుద్ధరించాల్సి ఉండగా కుడివైపు (లెఫ్ట్) రోడ్డును పునరుద్ధరించారు. అది కూడా సక్రమంగా లేదు. ఎడమవైపు (రైట్) రోడ్డు ఒక వర్గానికి చెందిన సమాధులు, మజీదు ఉండడంతో ఆ సమస్యను పరిష్కరించి సర్వీసు రోడ్డును పునరుద్ధరించకపోవడంతో అంబర్‌పేట, గోల్నాక ప్రజలు నరకాన్ని అనుభవిస్తున్నారు. అంబర్‌పేట నుంచి గోల్నాక గుండా చాదర్‌ఘాట్‌కు వెళ్లడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సివస్తుంది. గోల్నాకకు రావాలంటే ఛేనెంబర్ నుంచి జిందాతిలిస్మాత్ గుండా చుట్టూ తిరిగిరావల్సిందే తప్ప చేసేదేమి లేదు. ఈ నిర్మాణం నేరుగా ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి, వరంగల్ వెళ్లే వాహనదారుల కోసం నిర్మించారే తప్ప అంబర్‌పేట ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని స్థానికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో ఉప్పల్ నుంచి కోఠీ వరకు వచ్చే 115 రూట్ బస్సులు, అలాగే చార్మినార్, అఫ్జల్‌గంజ్ వచ్చే 71 రూట్ బస్సులు ఛేనెంబర్ గుండా గోల్నాక ద్వారా వెళ్లాల్సి ఉండగా ఈరూట్ నుంచి వెళ్లకుండా అలీకేఫ్ చౌరస్తా జిందా తిలిస్మాత్ రోడ్డు గోల్నాక కొత్తబ్రిడ్జి ద్వారా గోల్నాక చౌరస్తాకు అదనంగా 3 కి.మీకు పైగా దూరం తిరిగి పోవల్సిన దుస్థితి నెలకొంది. దీంతో వందల కోట్లతో నిర్మించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఫ్లైఓవర్ ప్రారంభించి 25రోజులు గడిచిపోతున్నా బంద్ ఉన్న సర్వీసు రోడ్డును పునరుద్ధరించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్న పాపాన ప్రభుత్వం, అధికారులు లేరు. గోల్నాక చౌరస్తా నుంచి కాచిగూడ కమేళా వరకు ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.



పునరుద్ధరణకు నోచుకోకుండా బంద్ ఉన్న ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు

వెంటనే చర్యలు తీసుకోండి



గోల్నాకలో సర్వీసు రోడ్డును పునరుద్ధరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి. సర్వీసు రోడ్ల పునరుద్ధరణ పూర్తయ్యాకనే ఫ్లైఓవర్‌ను ప్రారంభించాలని తాను ముందే కోరా. ఆ విషయాన్ని పట్టించుకోకుండా ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. కేంద్రమంత్రి గడ్కరీని కలిసి సమస్యపై వినతిపత్రం కూడా అందజేశాం. దీనిపై చర్యలు తీసుకుంటామని హామీ కూడా ఇచ్చారు. సర్వీసు రోడ్డు పునరుద్ధరణ చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేయాల్సి వస్తుంది.

- కాలేరు వెంకటేష్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే

ఆందోళన చేపడుతాం



గోల్నాక నుంచి ఛేనెంబర్ సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కోట్లాది రూపాయలతో ఫ్లైఓవర్ నిర్మించి సర్వీసు రోడ్డును పునరుద్ధరించకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. సర్వీసురోడ్డును పునరుద్ధరణ చేయకుంటే ఆందోళన చేపడుతాం.

- దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, గోల్నాక కార్పొరేటర్

చావనైనా చస్తాం.. మా ఇళ్లను ఖాళీ చేయం

అధికారులతో బీమామైదాన్ వాసుల వాగ్వాదం



వాంబే కాలనీలో నోటీసులు ఇవ్వడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్న స్థానికులు

కవాడిగూడ, మే 31 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బీమామైదాన్‌లో ఉన్న వాంబే కాలనీ ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేయించుకోవాలి లేదా ఇళ్లను ఖాళీ చేయాలని నోటీసులు అందజేయడానికి వచ్చిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్ రచనశ్రీని స్థానిక మహిళలు అడ్డుకున్నారు. నోటీసులు తీసుకునేది లేదని 18 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఇళ్ల నిర్మాణంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే శిథిలావస్థకు చేరుకున్నాయని ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదు. అవసరమైతే ఇక్కడే చస్తాం కాని మాకు ఎవరిపై నమ్మకం లేదని వారు చెప్పారు. వెంటనే తమ ఇళ్లకు నిధులు కేటాయించి మరమ్మతులు చేయాలని వారు కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శిథిలావస్థకు చేరిన వాంబే ఇళ్లు మిగతా బస్తీలకు శనివారం నోటీసులు అందజేశారు. అందులో భాగంగా మూడో రోజు కవాడిగూడ బీమామైదాన్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు హర్షిత, మౌనిక, సిబ్బంది జగన్, అనిల్‌లతో పాటు కవాడిగూడ కార్పొరేటర్ బస్తీకి వచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ, సమస్యను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి న్యాయమైన సమస్య పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె వారికి హామీ ఇచ్చారు.

రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం : ఎమ్మెల్యే కాలేరు



తిరుమలనగర్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ లావణ్య

గోల్నాక, మే 31 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. లక్షలాది రూపాయలతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం గోల్నాక డివిజన్ తిరుమలనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలు, వాడలలో రోడ్ల నిర్మాణం చేపట్టి అందమైన రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీనాయకులు ఎ.సురేష్‌గౌడ్, గండికోట జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

యజమాని ఎంతటి ధన్యుడో.. ఆ ధేనువుదెంతటి పుణ్యమో!

- 25 ఏళ్లుగా పెంచుకుంటున్న ఆవు మృతి
- కన్నీరుమున్నీరైన యజమాని, ఆయన కుటుంబసభ్యులు
- బ్యాండుమేళం మధ్య శ్మశానవాటికలో అంత్యక్రియలు



మృతి చెందిన ఆవుకు సాంప్రదాయబద్ధంగా కొత్త చీర కప్పి పూజలు చేసిన దృశ్యం

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): పెంచుకుంటున్న ఆవు చనిపోతే ఆప్తులు పోయినట్లుగా విలపించారు ఆ యజమాని, ఆయన కుటుంబసభ్యులు! బతికినన్నాళ్లూ పుష్కలంగా కమ్మని పాలు ఇచ్చి.. పద్దెనిమిది దూడలకు జన్మనివ్వడం ద్వారా పశుసంపదను పెంచిన ఆ గోమాతకు కన్నీటి వీడ్కోలు పలికారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించి ఆ మూగజీవితో తమకు ఉన్న ప్రగాఢ అనుబంధాన్ని చాటుకున్నారు. అడిక్‌మెట్‌లోని వెంకటేశ్ యాదవ్, ఆయన కుటుంబసభ్యుల ఆదర్శమిది! వెంకటేశ్ యాదవ్ వద్ద ఉన్న ఆవుల్లో 25 ఏళ్ల లక్ష్మి అనే గోవు ఎంతో ప్రత్యేకం. రోజూ పొద్దున, రాత్రి ఐదు లీటర్ల చొప్పున పాలిచ్చేది. కొన్నాళ్లుగా సుస్తీగా ఉన్న ఈ ఆవు శుక్రవారం చనిపోయింది. ఆ ఆవు కళేబరానికి ప్రత్యేకంగా స్నానం చేయించారు. నూతన వస్త్రాలు కప్పి పూలమాలలువేసి కొబ్బరి కాయలు కొట్టారు. బ్యాండు మేళంతో ఊరేగింపు నిర్వహించి.. పార్శిగుట్టలోని హిందూ శ్మశాన వాటికలో గొయ్యితీసి పూడ్చిపెట్టి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ సమాధిపై పూజలు చేశారు. లక్ష్మి తన జీవితకాలంలో 18 దూడలకు జన్మనిచ్చిందని, ఆ ఆవు సంతతి నాలుగో తరం దూడలు తనవద్ద ఉన్నాయని, వాటిలోనే చనిపోయిన లక్ష్మిని చూసుకుంటామని వెంకటేశ్ యాదవ్ గద్గద స్వరంతో చెప్పారు.

రోగికి అరుదైన చికిత్సతో పునర్జన్మ

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి) : నిరాశజనకమైన పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చిన మంచిర్యాలకు చెందిన దినేష్ (43) రోగికి అరుదైన చికిత్సతో కాచిగూడ ప్రతిమా ఆస్పత్రి వైద్యులు పునర్ జన్మనిచ్చారు. నెక్రో టైజింగ్ ప్యాంక్రియాటైటిస్ సేప్టీసిమియా బహుళ అవయవ వైఫల్యం, మూత్ర పిండం, గుండె వైఫల్యం, హెపాటిక్ ఏఆర్‌డీఎస్, టాక్సిక్, మెటబాలిక్ ఎన్సెపలోపతి, ఆల్కహాలిక్, అన్ కంట్రోల్డ్ డయాబెటిక్, ఫిమోసిస్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించి చికిత్స అందించడంతో రోగి ప్రాణాలతో బయటపడ్డారు. ప్రతిమా గ్రూప్ ఆఫ్ ఆస్పత్రి డైరెక్టర్ హరిణిరావు, డాక్టర్ సుప్రియా, తదితరులు పది రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స అందించారు.



సూపర్ స్టార్ కృష్ణ 82వ జన్మదిన సందర్భంగా సుదర్శన్ థియేటర్ నందు ఆల్ ఇండియా సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన అధ్యక్షుడు దిడ్డి రాంబాబు నాయకత్వంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న థియేటర్ యజమాని విశ్వంభర, మేనేజర్లు శ్రీనివాస్ రెడ్డి, కుమార్, అభిమానులు రాజ్‌రెడ్డి, యశ్వంత్

దుస్తుల షాపు యజమాని ఆత్మహత్య



మృతుడు సంతోష్‌కుమార్

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో దుస్తుల షాపు యజమాని ఆత్మహత్య చేసుకున్నాడు. ముషీరాబాద్ పీఎస్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం.. హుస్సేనీఆలంలో నివసిస్తున్న బి.సంతోష్‌కుమార్ (42) ఆయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. రాంనగర్ చౌరస్తాలో కొంతకాలం క్రితం నుంచి దుస్తుల షాపు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. షాపు సక్రమంగా నడవకపోవడం, ఇంట్లో సమస్యలు నెలకొనడంతో కొంత కాలంనుంచి ఇబ్బందులకు గురవుతున్నాడు. శనివారం తెల్లవారుజామున షాపుకు వచ్చి స్లాబ్ హుక్‌కు దుస్తులతో ఉరేసుకున్నాడు. షాపులో పనిచేస్తున్న వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. కేసును ముషీరాబాద్ సీఐ జి.రాంబాబు పర్యవేక్షణలో ఎస్ఐ లక్ష్మణ్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి : వీహెచ్



హనుమంతరావుకు బోకే అందజేస్తున్న లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, రాబోయే జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి నామినేటెడ్, పార్టీ పదవులు కల్పిస్తుందన్నారు. టీపీసీసీ రాష్ట్ర అడ్వయిజరీ కమిటీ సభ్యులు గా నియమితులైన వీహెచ్‌ను శనివారం బాగ్‌అంబర్‌పేటలోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, అఫ్సర్ యూసుఫ్ తదితరులు కలిసి శాలువాకప్పి పూలబొకే అందజేసి సత్కరించారు.

విద్యానగర్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ నూతన కమిటీ

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ నూతన కమిటీని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఎన్నికల విభాగం అధికారి అజయ్‌సింగ్ ప్రకటించారు. శనివారం విద్యానగర్‌లోని సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సొసైటీ లిమిటెడ్ ప్రధాన కార్యదర్శి బీ.హెచ్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం తదితరులు వివరాలను తెలిపారు. సొసైటీ అధ్యక్షుడుగా కె.ఎల్.కాంతారావు, ఉపాధ్యక్షుడుగా బి.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పి.వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శిగా బీ.హెచ్.శ్రీనివాస్, సభ్యులుగా కె.హరికృష్ణశర్మ, కె.విద్యుల్లత, సరోజిని నియమితులైనట్లు తెలిపారు. వీరి పదవీకాలం ఐదేళ్లపాటు ఉంటుందన్నారు.

'రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడి'గా సైకం నియామకం



మనోహర్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి రాష్ట్రాల ఉపాధ్యక్షుడిగా సైకం మనోహర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి శనివారం ప్రకటించి నియామక పత్రం అందజేశారు. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఐదేళ్లుగా మనోహర్‌రెడ్డి రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధితోపాటు సామాజిక సేవ నిర్వహణలో చురుకుగా పనిచేస్తున్నారన్నారు. వాకర్స్ క్లబ్ హైదరాబాద్ క్లబ్ ప్రధానకార్యదర్శిగా ప్రజలకు మెరుగైన సేవలను మనోహర్‌రెడ్డి అందిస్తున్నారని ప్రశంసించారు.

ప్రశాంతంగా ముగిసిన యవ్వనస్థుల కూటములు

చిక్కడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ క్రాస్‌రోడ్‌లో ప్రసిద్ధి చెందిన హెబ్రోన్ చర్చిలో నిర్వహించిన 58వ అఖిలభారత యవ్వనస్థుల కూటములు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా హెబ్రోన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సొసైటీ అధికారప్రతినిధి ఆర్.వీరాచారి మాట్లాడారు.



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, బీజేపీ నేతలు



గోల్నాక డివిజన్ గంగానగర్ లోని కమ్యూనిటిహాల్‌లో..



బషీర్‌బాగ్‌లో జరిగిన ఆహల్యబాయ్ హోల్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు దీపక్‌రెడ్డి, చింతల, గౌతమ్‌రావు

ఘనంగా రాజమాత శోభాయాత్ర

కవాడిగూడ, చిక్కడపల్లి, గోల్నాక, మే 31 (ఆంధ్రజ్యోతి): పుణ్యశ్లోక, రాజమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది 300 జయంతి ఉత్సవాలు జయంతి సందర్భంగా శనివారం గాంధీనగర్‌లో మహిళలతో పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీరాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు.